
సాక్షి
ఖమ్మం
బుధవారం, 15, నవంబర్, 2023



అధిక సాంద్రతతో 'పంట'
అధిక సాంద్రత విధానంలో పత్తి పంట సాగు చేస్తే దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. 10లో



సమస్యల సుడిగుండం
రెండుపక్కలా సింగరేణి, జీటీపీఎస్ ఉన్నా.. ఎవరూ పట్టించుకోక ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. 10లో

గరిష్ఠం/కనిష్ఠం
32°/21°
వాతావరణం
జిల్లాలో బుధవారం చలి ప్రభావం పెరుగుతుంది. తెల్లవారుజామున, రాత్రి మంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాలలు మంచి పౌరులుగా ఎదగాలి..



మాట్లాడుతున్న న్యాయమూర్తి జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: బాలలందరూ శ్రద్ధగా చదువుకుని మంచి పౌరులుగా ఎదగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం బాలల సదన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. బాలలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు దరిచేరేలా న్యాయసేవా సంస్థ ద్వారా కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణువందన మాట్లాడగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సదన్ పర్యవేక్షకురాలు వరలక్ష్మి, న్యాయవాదులు కె.చంద్రశేఖర్, చైల్డ్‌లైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

వచ్చేనెల 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో బ్యాంకర్లు రుణ వసూలు కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జావేద్ పాషా సూచించారు. వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమైన ఆయన లోక్ అదాలత్ విధివిధానాలు, లాభాలను వివరించారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం



డీసీసీబీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన సీఈఓ నర్మద, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా సహకార వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సహకార ప్రగతి, ఆర్థిక స్థితిగతులు, లక్ష్యాలు తదితర అంశాలను మననం చేసుకోవటంతో పాటు అవగాహన కల్పించేందుకు గాను ఏటా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈమేరకు మంగళవారం ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఈఓ కె.నర్మద సహకార జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ ఏ.పద్మావతి, అధికారులు పాల్గొన్నారు. అలాగే, డీసీసీబీ బ్రాంచ్‌లు, పీఏసీఎస్‌ల్లోనూ వారోత్సవాలు మొదలుకాగా, జిల్లా సహకార అధికారి విజయకుమారి పర్యవేక్షిస్తున్నారు.

'ఓపెన్' ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు ప్రవేశాలు పొందొచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు (80084 03522)ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

మరింత సరళంగా ఏపీజీవీబీ సేవలు



బ్రాంచ్ మేనేజర్‌ను అభినందిస్తున్న చైర్మన్ ప్రతాపరెడ్డి

కామేపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) ద్వారా ఖాతాదారులకు సేవలను మరింత సరళీకృతం చేస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ కె.ప్రతాపరెడ్డి వెల్లడించారు. కామేపల్లి మండలం పండితాపురంలోని ఏపీజీవీబీ బ్రాంచ్‌ను సందర్శించిన ఆయన ఖాతాదారులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు శాఖలను విస్తరిస్తూ ఖాతాదారులకు సేవలందిస్తున్నామని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఆతర్వాత పలువురు ఉద్యోగులను చైర్మన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం ఎం.ఉదయ్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ జె.సత్యకీర్తితో పాటు జయప్రకాశ్, జోగారెడ్డి, వరుణ్, శివమోహన్, ఉమారాణి పాల్గొన్నారు.

ఆ నలుగురు..!

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో వారిదే ప్రధాన భూమిక

- ఉమ్మడి జిల్లా అంతా తామై వ్యవహరిస్తున్న నేతలు
- ప్రచారం మొదలు చేరికల వరకు సమన్వయం
- బీఆర్‌ఎస్‌లో కీలకంగా మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీలు నామ, వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు
- కాంగ్రెస్‌లో భట్టి, శ్రీనివాసరెడ్డి, తుమ్మల, బాలసాని



పువ్వాడ అజయ్‌కుమార్



భట్టి విక్రమార్క



నామా నాగేశ్వరరావు



పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వద్దిరాజు రవిచంద్ర



తుమ్మల నాగేశ్వరరావు



తాతా మధు



బాలసాని లక్ష్మీనారాయణ

ఎవరి ప్రతిష్ట పెరిగేనో..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఈ నేపథ్యాన కీలక నేతలు ఇతర పార్టీల నేతలను చేరుకోవడమే కాక ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకోవడంలో నిమగ్నమయ్యారు. గతంలో కన్నా భిన్నంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్ నేతలు అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం సర్వశక్తులొడ్డుతున్నారు. ఇందుకోసం తమ నియోజకవర్గాల్లోనే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అభ్యర్థుల ప్రచారానికి హాజరవుతున్నారు. అయితే ఓటర్లను ఆకట్టుకోవడంలో వీరిలో ఎవరు సఫలమవుతారో ఫలితాలు వచ్చాక తేలిపోనుంది.

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయాలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని ఆ నేతల చుట్టే తిరుగుతున్నాయి. ప్రచారం నుంచి నేతలు, కార్యకర్తల సమన్వయం, చేరికలు, వ్యూహాల రూపకల్పన తదితర అంశాల్లో వీరే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్, కాంగ్రెస్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఈ వ్యవహారాలను చక్కబెడుతున్నారు.

పావులు కదుపుతున్న బీఆర్‌ఎస్

రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బీఆర్‌ఎస్ తరఫున ఖమ్మం నుంచి బరిలో ఉండగా.. తన నియోజకవర్గంతోపాటు ఇతర చోట్ల కూడా అక్కడి నేతలతో సమన్వయం చేసుకుంటున్నారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు అన్ని స్థానాల్లో అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహ, ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. మంత్రి పువ్వాడకు మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా ఆయన దృష్టి సారించారు. ఇక ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవతో బీఆర్‌ఎస్‌లోకి మాజీ మంత్రి సంభాని సహా పలువురి చేరికలు జోరందుకోగా, ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా ప్రచారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. మరోపక్క బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారం, వ్యూహాల రూపకల్పనలో ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు చురుగ్గా వ్యవహరిస్తూ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నారు.

దీటుగా కాంగ్రెస్ సమన్వయం

సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సమన్వయం చేస్తున్నారు. భట్టి తన నియోజకవర్గం మధిరతోపాటు ఇతర నియోజకవర్గాల ప్రచారంలోనూ పాల్గొంటున్నారు. ఇక పొంగులేటి పాలేరులో ప్రచారం చేస్తూనే కొత్తగూడెం తదితర ప్రాంతాలకు హాజరవుతున్నారు. భట్టి, పొంగులేటి, తుమ్మల ఉమ్మడి జిల్లాను ప్రభావితం చేయదగిన నేతలు కావడంతో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల సభలు, రోడ్ షోలు జరగనుండగా ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇక మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అటు భద్రాచలం, ఇటు ఖమ్మంపై దృష్టి సారించి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

కేటీఆర్ రోడ్‌షో

- ఉమ్మడి జిల్లాలో రెండు రోజులు ప్రచారం
- 18న కొత్తగూడెం, 19న భద్రాచలం, ఇల్లెందు, ఖమ్మంలో..



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రచార జోరు పెంచింది. ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు చివరి దశకు చేరగా... మరోపక్క మంత్రి కేటీఆర్ రోడ్‌షోలకు షెడ్యూల్ ఖరారైంది. సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఏడు సభల్లో పాల్గొనగా.. ఈనెల 21న మధిర, వైరా ప్రజా ఆశీర్వాద సభలు జరగనున్నాయి. ఇక రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 18, 19వ తేదీల్లో జరిగే రోడ్ షోలకు హాజరుకానున్నారు. ఈనెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెంలో, 19న భద్రాచలం, ఇల్లెందు, ఖమ్మంలో జరిగే రోడ్‌షోల్లో కేటీఆర్ పాల్గొని అక్కడి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు. కాగా, ముఖ్యనేతల రోడ్డు షోలు పూర్తయ్యాక అభ్యర్థులు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో భారీ ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

గెలవలేకే విషం చిమ్ముతున్నారు..

- మంత్రి పదవి ఇచ్చిన ఎన్టీఆర్, కేసీఆర్‌నే తుమ్మల మోసం చేశారు
- రోడ్ షోలో ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్





ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, శ్రేణులు (ఇన్‌సెట్) ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు జీవితమంతా అధర్మ పోరాటమేనని ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో మంగళవారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ఖమ్మం వాసులకు ఏ మాత్రం మేలు చేయని వ్యక్తి ఇప్పుడు పోటీకి వచ్చాడని, 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన ఎవరినీ ఎదగనివ్వకపోగా మంత్రి పదవి ఇచ్చిన ఎన్టీఆర్, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడని తెలిపారు. ఇక ఇప్పుడు తనపై గెలిచే సత్తా లేక నామినేషన్ విషయంలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.వేల కోట్లు నిధులు తీసుకొచ్చి ఒకప్పుడు కనీస సదుపాయాలు లేని ఖమ్మంను ఆదర్శవంతంగా తీర్చిదిద్దానని తెలిపారు. ఈ అభివృద్ధి ఇలానే సాగాలంటే మరోమారు తనకు అవకాశం కల్పించాలని పువ్వాడ కోరారు. ఇక ఖమ్మం 25వ డివిజన్‌లో పువ్వాడ అజయ్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. మూడోసారి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, ఇంటింటికీ బీమా, రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని తెలిపారు. కాగా, మామిళ్లగూడెంలో వెండి, బంగారం నగల సంఘం మాజీ అధ్యక్షుడు వెగ్గలం శ్రీనివాసరావు ఆధ్వర్యాన త్రీయ సమ్మేళనంలో పువ్వాడ అజయ్ మాట్లాడారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, బానోతు చంద్రావతి, బుడిగం శ్రీనివాస్, పసుమర్తి రామోహన్‌రావు, శీలంశెట్టి రమ, జక్కుల లక్ష్మయ్య, విజయ్, గుమ్మడివెల్లి శ్రీను, గొరోజు వసంత్, సుంకర నర్సింహారావు, నర్సింహాచార్యులు, దేశరాజు వెంకటేశ్వరరావు, సదానందాచారి, ఇనుగుర్తి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధులకు 6,560మంది

- ఉద్యోగుల రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి
- పర్యవేక్షించిన పరిశీలకులు, కలెక్టర్ గౌతమ్



ఉద్యోగుల ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎన్నికల పరిశీలకులు

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో అధికారులు ఏర్పాట్లలో వేగం పెంచారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల పరిశీలకులు తుషార్‌కాంత మహంతి, సతేంద్రసింగ్, కానారామ్ సమక్షాన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఉద్యోగుల రెండో విడత ర్యాండమైజేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 1,456 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 6,560 మంది ఉద్యోగులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి ఐదు మహిళా బృందాలు, యువకులు, దివ్యాంగుల కేంద్రాలకు సంబంధించి ప్రత్యేక బృందాలను గుర్తించినట్లు చెప్పారు. అక్కడ ఏర్పాటుచేసే మోడల్ కేంద్రాల్లో వీరు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. అనంతరం మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. జిల్లాలో అవసరమైన 256 మంది మైక్రో అబ్జర్వర్లతో పాటు రిజర్వ్‌డ్‌గా కొందరిని ఎంపిక చేశారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల(సూక్ష్మ పరిశీలకులు) పాత్ర కీలకమైనదని, పోలింగ్ సజావుగా జరిగేలా విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు సత్యేంద్రసింగ్, తుషార్ కాంత మహంతి, కానారాం సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటుచేసిన శిక్షణలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి వారు మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని, ప్రతీఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. కాగా, మైక్రో అబ్జర్వర్లకు పనిచేసే చోట, ఓటు కలిగిన నియోజకవర్గంలో కాకుండా ఇతర చోట్ల విధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

ప్రతీఒక్కరికి ఓటర్ స్లిప్‌లు

జిల్లాలోని ప్రతీఒక్కరికి ఓటర్ స్లిప్పు అందేలా పర్యవేక్షించాలని రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. హైదరాబాద్ నుంచి ఆయన వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. స్థానికంగా కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన యువతను వెబ్ క్యాస్టింగ్ కోసం ఉపయోగించుకోవాలని, ముందస్తుగా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టాలని తెలిపారు. వివిధ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలను సైతం ఓటర్‌స్లిప్పుల పంపిణీలో భాగస్వామ్యం చేయాలన్నారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్‌కుమార్, నోడల్ అధికారులు విజయనిర్మల, రాంప్రసాద్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు శ్రీనివాసరెడ్డి, కె.శ్రీరామ్, మదన్ గోపాల్, ఏ.శ్రీనివాస్, అరుణ, రాంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో వేగం పెంచండి

నేలకొండపల్లి: పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి, పంచాయతీరాజ్ ఎస్ఈ గండికోట చంద్రమౌళి ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. నేలకొండపల్లి పోలింగ్ కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈఈ వేణుగోపాల్, నేలకొండపల్లి ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

ఉద్యోగుల శిక్షణలో సీపీ వారియర్



మాట్లాడుతున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పోలీసు ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. పోలీస్ అధికారులు, ఉద్యోగులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తిస్తూ ఎక్కడా పొరపాటు జరగకుండా చూసుకోవాలన్నారు. అలాగే, సమస్యాత్మక కేంద్రాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, కుమారస్వామి, ఏసీపీలు గణేష్, బస్వారెడ్డి, రెహమాన్, రామానుజం, సారంగపాణి, ప్రసన్నకుమార్, రవికుమార్, శివరామయ్య, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

వయసుల వారీగా లెక్క తేలింది..

- ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 21,83,235
- అత్యధికంగా 30-39 ఏళ్ల వారు 6,11,935 మంది
- 80ఏళ్లు పైబడిన వారు 29,888 మందే..
- కీలకం కానున్న 39ఏళ్ల వయసు లోపు ఓటర్లు



ఖమ్మం సహకారనగర్: ఓటర్ల తుది జాబితాను ఈనెల 10న విడుదల చేయగా ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో కలిపి 21,83,235 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. అయితే, అధికారులు మంగళవారం వయసుల వారీగా సైతం ఓటర్ల వివరాలు వెల్లడించారు. కాగా, అన్ని నియోజకవర్గాల్లో కలిపి 30నుంచి 39 ఏళ్ల వయసు ఓటర్లు అత్యధికంగా ఉన్నట్లు జాబితా ద్వారా తెలిసింది. ఈ కేటగిరీలో 6,11,935 మంది ఓటర్లు ఉండగా.. అతి తక్కువగా 80ఏళ్ల వయసు పైబడిన వారు 29,888 మంది ఉన్నారు. కాగా, మొత్తం ఓటర్లలో 18 నుంచి 39ఏళ్ల లోపు వయసు ఓటర్లు 11,20,279 మంది ఉండడంతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటముల్లో వీరే కీలకపాత్ర పోషించే అవకాశముందని భావిస్తున్నారు.

వయస్సు	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80+	మొత్తం
పినపాక	5,949	40,507	56,791	38,541	29,475	17,503	7,291	2,345	1,98,402
ఇల్లెందు	6,408	43,799	64,259	40,729	31,619	19,405	9,662	3,688	2,19,569
ఖమ్మం	13,599	64,757	86,705	68,248	47,086	25,938	12,737	3,926	3,22,996
పాలేరు	9,941	49,542	68,177	45,513	32,177	19,117	9,145	2,675	2,36,287
మధిర	8,523	41,330	59,028	42,464	34,863	21,400	10,310	3,408	2,21,326
వైరా	7,680	38,709	54,506	34,735	29,020	17,064	8,219	3,136	1,93,069
సత్తుపల్లి	9,653	48,219	66,313	44,621	37,595	22,521	10,559	3,637	2,43,118
కొత్తగూడెం	7,508	47,515	67,773	50,852	36,523	21,005	9,457	3,213	2,43,846
అశ్వారావుపేట	4,817	30,597	44,999	29,756	24,003	13,630	6,070	2,089	1,55,961
భద్రాచలం	2,808	26,503	43,384	30,949	23,070	13,872	6,304	1,771	1,48,661
మొత్తం	76,886	4,31,478	6,11,935	4,26,408	3,25,431	1,91,455	89,754	29,888	21,83,235

కార్తీకం.. కమనీయం



కార్తీక మాసం మొదలుకావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం దేవాలయాల్లో అర్చకులు మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈమేరకు పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళా భక్తులు దీపాలు వెలిగించారు.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఖమ్మంలోని గుంటు మల్లన్న క్షేత్రంలో స్వామి

క్లుప్తంగా

జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీకి వసంత


వసంత

ఖమ్మం స్పోర్ట్స్: గజ్వేల్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఖమ్మంలోని ఆర్‌జేసీ కళాశాల విద్యార్థి జి.వసంత ప్రతిభ కనబర్చి హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. డిసెంబర్‌లో జరిగే పోటీల్లో ఆమె తెలంగాణ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈసందర్భంగా వసంతను ఆర్‌జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఏ.లింగయ్య, ఏ.లక్ష్మీపతి, ఇన్‌చార్జి ఉపేందర్ మంగళవారం అభినందించారు.

వీవీసీ గ్రూప్ ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న సంస్థ ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: వీవీసీ గ్రూపుల అధినేత దివంగత వంకాయలపాటి రమణప్రసాద్ జయంతిని ఖమ్మం మమత రోడ్డులోని వీవీసీ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు 110 మంది రక్తదానం చేయగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొని రమణప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పించడంతో పాటు ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో వీవీసీ, వీఆర్‌ఏ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం దొరకక ఇబ్బంది పడేవారికి అండగా నిలిచేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటుచేశామని తెలిపారు. ఆతర్వాత గ్రూప్‌లో 30ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఉద్యోగులను ఎండీతో పాటు డైరెక్టర్లు వీరేస్‌చౌదరి, వికాస్‌చౌదరి, ఆదిత్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ద్రౌపతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య

విధుల్లో ఒత్తిడే కారణమని సూసైడ్‌నోట్

ఖమ్మంరూరల్/కారేపల్లి: కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా గ్రామపంచాయతీ పరిధి లావుడ్యాతండాకు చెందిన బ్యాంకు మేనేజర్ ఖమ్మంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లావుడ్యాతండా గ్రామానికి చెందిన గుగులోతు అశోక్ (37) ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి సమీపాన శ్రీసాయి ఆదిత్య టౌన్‌షిప్‌లో ఉంటూ సూర్యాపేట జిల్లా కోదాడ యూనియర్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం విధులకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఆయన మధ్యాహ్నం తన ఇంటి సమీపంలోని వ్యక్తికి ఫోన్‌చేసి చెప్పి ప్రమాదంలో ఉన్నానంటూ చెప్పి లొకేషన్ పంపించాడు. దీంతో ఆయన వెళ్లి ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం సమీపాన వెతకగా చెట్లపొదల్లో అశోక్ మృతదేహం కనిపించింది. ఆ పక్కనే పురుగుల మందు డబ్బా, బ్యాంక్ విధుల్లో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా సూసైడ్ నోట్ లభించింది. ఈమేరకు అశోక్ భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

తిరుమలాయపాలెం: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని జూపెడకు చెందిన నూకల కటరెడ్డి(50) గ్రామంలో కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యాన సోమవారం ఇంటినుంచి వెళ్లిపోయిన ఆయన మంగళవారం రాత్రి కాకరవాయి రహదారి పక్కన శవమై కనిపించాడు. కాగా, కటరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడనే సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టారు.

సమస్యల సుడిగుండం..

- బీటీపీఎస్, సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యం
- ఆగమవుతున్న స్థానికుల బతుకులు
- వ్యాధులతో అవస్థ, సమస్యలతో సతమతం
- అంతంత మాత్రంగానే ఉపాధి అవకాశాలు


గోదావరిలో కలుస్తున్న బీటీపీఎస్ నుంచి వెలువడే వ్యర్థాలు

ప్రజా అజెండా

మణుగూరుటౌన్: సింగరేణి ఓపెన్‌కాస్ట్, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రభావిత ప్రాంత ప్రజలు, గ్రామాలు అభివృద్ధికి నోచుకోక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తమ గ్రామం అభివృద్ధి బాట పడుతుందని, జీవితాలు బాగుపడతాయని ఆశిస్తే చివరికి నిరాశే ఎదురవడం వారి ఆవేదనకు కారణమవుతోంది. పారిశ్రామిక సంస్థలు ప్రారంభ సమయంలో ఇచ్చిన హామీలు ఏళ్లు గడుస్తున్నా నెరవేరలేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి గనులు కాలుష్యపు కోరలు చాచగా, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ బొగ్గు తరలింపుతో వస్తున్న కాలుష్యం, పైపు లీకేజీలతో గరళంగా మారుతున్న గోదావరి, నిత్య ప్రమాదాలతో గాలిలో దీపాలుగా మారిన ప్రజల ప్రాణాలు, పట్టింపులేని పాలకుల తీరుతో నిత్యనరకం అనుభవిస్తున్నారు.

బతుకు జీవుడా..

ప్రభావిత ప్రాంతాల ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తూ రోగాలతో అవస్థలు పడుతూ ఆర్థిక నష్టానికి గురవుతూ బతుకుజీవుడా అంటూ జీవిస్తున్నారు. అభివృద్ధి పేరిట తీసుకున్న స్థలాల్లో వెలిసిన సంస్థలు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. బీటీపీఎస్, సింగరేణి వల్ల వస్తున్న కాలుష్యం, లీకేజీ, బొగ్గు లారీల ప్రమాదాలతో, శ్వాసకోస వ్యాధులతో నిత్యం సతమతమవుతున్నారు. 'దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు' అన్న చందంగా వారి దుస్థితి మారింది. సింగరేణి ప్రభావిత గ్రామాలైన విప్పలసింగారం, పగిడేరు, మణుగూరు, రాజుపేట, గాంధీనగర్, బీటీపీఎస్ ప్రభావిత ప్రాంతాలైన దమ్మక్కపేట, సాంబాయిగూడెం, రామానుజవరం గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలూ అందుబాటులోకి రాలేదు. సింగరేణిలో ప్రతిరోజు జరిగే బ్లాస్టింగ్‌లతో గాంధీనగర్, రాజుపేట, పగిడేరు గ్రామాల్లోని నివాసాలు బీటలు వారుతున్నాయి. బ్లాస్టింగ్‌కు లేచిన దుమ్ము, ధూళి ఇంటిలోని తాగునీటిపై చేరుతోంది. ఆ నీళ్లను తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మణుగూరు ఓసీ నుంచి సింగరేణికి.. సింగరేణి నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు తరలిస్తున్న క్రమంలో లారీల వేగానికి వందల జీవాలు, ప్రజల ప్రాణాలు కోల్పోగా, వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బీటీపీఎస్ యాష్‌పాండ్ లీకేజీతో గోదావరిలో బూడిద కలిసి కలుషితమవుతున్నాయి. వెలువడుతున్న వ్యర్థ పదార్థాలు దమ్మక్కపేట, చిక్కుడుగుంట, సాంబాయిగూడెం నివాసాలపై పడటం.. ఆ గాలిని పీల్చి శ్వాస కోశ వ్యాధులతో పాటు చర్మ సంబంధిత రోగాలు, జ్వరాలు, ఎముకలకు సంబంధించిన వ్యాధులను తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అయినప్పటికీ హెల్త్ క్యాంపు నిర్వహించకపోవడం గమనార్హం.

అభివృద్ధి శూన్యం..

ప్రభావిత ప్రాంతాల మౌలిక సదుపాయాల ఏర్పాటు, అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన అంశాలపై ఆయా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సింగరేణి, బీటీపీఎస్ ప్రత్యేక నిధులైన సీఎస్‌ఆర్, సంక్షేమ నిధులు కేటాయిస్తున్నా అవి తమ గ్రామాల్లో వినియోగించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు, నివాసాలు, పొలాలు కోల్పోయి ఆరోగ్యం కూడా కోల్పోతున్నారు. అయినా తమకు కనీసం రోడ్లకు మరమ్మతులు, సైడ్ డ్రైయిన్లు, తాగునీరు, డ్రెయినేజీలు, విద్యుత్ దీపాలు కల్పించడం లేదని వినతులు ఇచ్చినా బుట్టదాఖలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కల్పన నామమాత్రమే

బీటీపీఎస్‌లో డిగ్రీ నుంచి పీజీ చదివిన వారితో పాటు నిరక్షరాస్యులకూ రూ.300 నుంచి రూ.350 మించి రోజువారీ వేతనం ఇవ్వకపోవడంతో వెట్టి చాకిరీకి ప్రతిరూపంగా మారినట్లయింది. సబ్ కాంట్రాక్టర్ల ద్వారా స్థానికేతరులకే అవకాశం కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీటీపీఎస్ భూనిర్వాసితులకు కొందరికి జెన్కో శాశ్వత ఉపాధి కల్పించగా, ఆయా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే వారు మౌలిక సదుపాయాలపై ప్రశ్నించినా ఫలితం ఉండటం లేదు. సింగరేణి ఓబీ కంపెనీలతో పాటు ఇతర ప్రైవేట్ కంపెనీల్లో 70 శాతం స్థానికులకే అవకాశం కల్పించాలని ఉన్నా అవేవి అమలు కావడం లేదని పగిడేరు, గాంధీనగర్, బుగ్గ, రాజుపేట, సాంబాయిగూడెం మణుగూరు యువకులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

సీఎస్‌ఆర్ నిధులు ఎక్కడ?



సీఎస్‌ఆర్ నిధులను బీటీపీఎస్, సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో కాకుండా ఇతర చోట్ల వెచ్చిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల సిఫారసుతో ఇలా చేస్తున్నామని అధికారులు అంటున్నారు. ఇకనైనా పాలకులు సీఎస్‌ఆర్ నిధులు ప్రభావిత గ్రామాల్లోనే వినియోగించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. –మధుసూదన్‌రెడ్డి, ఎన్‌డీ నాయకుడు

మా గ్రామాలకు నిధులు లేవు



2018లో రూ.90 లక్షలు సీఎస్ ఆర్ ఫండ్ సింగరేణి ఇచ్చింది. ఆ తర్వాత రూపాయి రాలేదు. పగిడేరు బీటీపీఎస్, సింగరేణికి ప్రభావిత గ్రామమైనా పట్టించుకోవడం లేదు. కలెక్టర్, అదనపు కలెక్టర్, సింగరేణి అధికారులకు వినతిపత్రాలు ఇస్తే ప్రతిపాదనలతో సరిపెడుతున్నారు. –తాటి సావిత్రి, పగిడేరు సర్పంచ్

వ్యాధులతో అవస్థ పడుతున్నాం



బీటీపీఎస్ వ్యర్థాలతో కలుషితం అవుతున్న నీరు తాగి, గాలి పీల్చి వ్యాధులతో అవస్థ పడుతున్నాం. నెలకు రెండుసార్లు ఇంట్లో అందరూ జ్వరాల బారిన పడుతున్నాం. అయినా మమ్మల్ని పట్టించుకునే నాథులే లేరు. మురుగునీరు తాగలేక ప్లాంట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. –కనకమ్మ, చిక్కుడుగుంట గ్రామస్తురాలు

పంటలు దిగుబడి పోయింది..



మా భూములు తీసుకునే సమయంలో ఉపాధి, విద్య, వైద్యంపై ఇచ్చిన హామీల అమలు ఊసేలేదు. బీటీపీఎస్, సింగరేణి ప్రభావిత ప్రాంతమైన విప్పలసింగారంలోని కోల్ వాషరీ ప్లాంట్ నీరు పొలాల్లోకి వస్తోంది. దీంతో దిగుబడి పోయిందని చెప్పినా పట్టించుకోవట్లేదు. –సోడె రవి, విప్పలసింగారం గ్రామస్థుడు

ఎపిక్ కార్డులొచ్చేస్తున్నాయ్..

ఎపిక్ కార్డులను పంపించేందుకు సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఖమ్మంసహకారనగర్: ఓటరుగా నమోదు చేసుకుని గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి నిరీక్షణకు తెరపడనుంది. కొత్త ఓటరుగా నమోదు చేసుకున్న వారిలో కొందరికి ఇప్పటికే కార్డులు ఇంటికి చేరగా.. మిగతా వారికి సైతం పంపించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఖమ్మం కలెక్టరేట్‌కు చేరిన కార్డులను సిబ్బంది ప్రత్యేక కవర్లలో పెట్టి తపాలాశాఖ ఉద్యోగులకు అందజేస్తున్నారు. అక్కడి నుంచి స్పీడ్ పోస్టులో ఓటర్లకు కార్డులు చేరతాయి. కాగా, ఈ కవర్‌లో ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఓటరు ప్రతిజ్ఞ, ఓటు వేసే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్నికల సంఘం రూపొందించిన కరపత్రాలు కూడా ఉన్నాయి.

కాంగ్రెస్‌కు జెడ్పీటీసీ గుడ్‌బై

హరీశ్‌రావు సమక్షాన బీఆర్‌ఎస్‌లో చేరిక


మంత్రి హరీశ్‌రావుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ

కామేపల్లి: ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని కామేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు బానోత్ వెంకట ప్రవీణ్‌కుమార్‌నాయక్ కాంగ్రెస్‌ను వీడారు. కాంగ్రెస్ నుంచి ఇల్లెందు టికెట్ ఆశించిన ఆయనకు నిరాశ ఎదురుకావడంతో రెబల్‌గా నామినేషన్ వేశారు. ఇంతలోనే మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షాన బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయన వెంట పాన్నేకల్ ఎంపీటీసీ మాలోత్ శంకర్‌నాయక్ కూడా గులాబీ కండువా కప్పుకున్నారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా...

పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


తిరుమలాయపాలెంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: పదేళ్లలో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలని కుట్రలు పన్నిందని... తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు కేటాయించిందని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు ఇచ్చేదంతా ప్రజల డబ్బే అయినందున తీసుకుని కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని కోరారు. తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. దొరల ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజల ప్రభుత్వాన్ని తీసుకొచ్చేలా తీర్పు ఇవ్వాలని కోరారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉండే తనను గెలిపిస్తే రాబోయే ఇందిరమ్మ రాజ్యంలో వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని తెలిపారు. కొందరు నాయకులు తిరుమలాయపాలెం మండలాన్ని దత్తత తీసుకోవాలని కోరానని.. కానీ పాలేరు నియోజకవర్గాన్నే దత్తత తీసుకుని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పొంగులేటి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ మంగీలాల్‌తో పాటు కాంగ్రెస్, సీపీఐ నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, మద్ది శ్రీనివాసరెడ్డి, బుద్దా వంశీకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, బత్తుల రాధాకృష్ణ గోళ్ల రేణుక లింగయ్య, అంబేద్కర్, చుంచు వెంకటేశ్వర్లు, సైపుద్దీన్, గడ్డికొప్పుల రాజు, చుంచు రాములు నాయకులు పూర్ణచందర్రావు, శ్రీను, సంద్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా, మాజీ ఎంపీపీ కొక్కిరేణికి చెందిన ఊడుగు రామయ్యను పరామర్శించిన పొంగులేటి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా సీపీఐ పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం చట్టసభలో తమ గొంతులు వినిపిస్తామన్నారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ ఎన్నికల ప్రణాళికను విడుదల చేసి మాట్లాడారు. తాగు, సాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు గతంలో మాదిరి పోరాడుతామని తెలిపారు. నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, తాటి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మళ్లొస్తేనే సంక్షేమం

ఎంపీ నామా నాగేశ్వరరావు


బావోద్వేగానికి గురైన కందాళను సముదాయిస్తున్న ఎంపీ తదితరులు

కూసుమంచి: మళ్లీ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అవాంతరాలు లేకుండా కొనసాగుతాయనే విషయాన్ని ఓటర్లకు వివరించాలని ఎంపీ నామా నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని పాలేరులో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ బూత్ లెవల్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు మరో 15 రోజులు కష్టపడితే కందాళ ఉపేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించవచ్చని తెలిపారు. ప్రతీ బూత్ సభ్యుడు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చే బాధ్యత స్వీకరించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరుగుతుందనే విషయాన్ని వివరించడంతో కందాళ ఆధ్వర్యాన పాలేరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వెల్లడించాలని సూచించారు.


ఎమ్మెల్యే భావోద్వేగం

ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు జై కందాళ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన ఒక్కసారిగా బావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. ఎంపీ నామా, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ ఆయనను సముదాయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లుగా పాలేరు ప్రజలను తన బిడ్డల్లా చూసుకున్నానని, పార్టీలకతీతంగా అండగా నిలిచానని తెలిపారు. అయితే, కొందరు స్వార్థం కోసం తనతో పాటు పార్టీకి అన్యాయం చేశారని అన్నారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు తాళ్లూరి జీవన్‌బాబు, రామసహాయం బాలకృష్ణారెడ్డి, కంచర్ల పద్మ, రాంకుమార్, వేముల వీరయ్య పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కూరపాటి తిరుపతమ్మ(100) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. కాగా, మంగళవారమే ఆమె 100వ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించేందుకు కుటుంబీకులు ఏర్పాట్లుచేశారు. అయితే, పదిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె కన్నుమూయగా కుటుంబంలో విషాదం నెలకొంది. ఆమె మృతదేహం వద్ద వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, శీలం ప్రతాపరెడ్డి, కూరపాటి సుందరమ్మ, కూరపాటి యశోద, అయిలూరి నాగిరెడ్డి, ముక్కర చిన్నలక్ష్మారెడ్డి, కూరపాటి కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, జయరావు తదితరులు నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి...


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి(35) మంగళవారం మృతి చెందాడు. ఉదయం 10 గంటల సమయాన ఖమ్మం పాత బస్టాండ్ వద్ద నోటి నుంచి రక్తస్రావమవుతూ అపస్మారక స్థితిలో వ్యక్తిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చేస్తుండగానే ఆయన మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59107 నంబర్‌లో సంప్రదించాలని ఖమ్మం వన్‌టౌన్ సీఐ స్వామి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెం వద్ద ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పువ్వాడనగర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు ఎం.అంజయ్య (60) పనికి వెళ్లి శివాయిగూడెం వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వైరా రిజర్వాయర్‌లో మహిళ మృతదేహం


ఉషారాణి (ఫైల్)

వైరా/కొణిజర్ల: వైరా మున్సిపాలిటీ పరిధి ఇందిరమ్మ కాలనీ నుండి గండగలపాడు వెళ్లే మార్గంలో వైరా రిజర్వాయర్ కుడి కాల్వలో మంగళవారం కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలం అమ్మపాలెం సమీపంలోని రాజ్యతండాకు చెందిన రాజిలిక ఉషారాణి(55)కి భర్త లేకపోవడంతో తన సోదరుల వద్ద నివసిస్తోంది. ఆమె కీళ్ల సంబంధించిన వ్యాధితో బాధతుండడమే కాక మతిస్థిమితం లేక తరచుగా బయటకువెళ్లేది. గత నెల 28న కూడా అనాథాశ్రమం చిరునామా తెలుసుకుని వస్తానని చెప్పి రాకపోవడంతో వెతుక్కుని వస్తానని చెప్పి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలించినా ఫలితం లేక ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే మంగళవారం సాయంత్రం రిజర్వాయర్ కుడి కాల్వలో మృతదేహం బయటపడగా, పరిశీలించిన పోలీసులు ఉషారాణిదిగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని వెలికి తీయించారు.

సారా విక్రయదారుడికి రూ.లక్ష జరిమానా

కారేపల్లి: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని కారేపల్లి ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన బానోతు రాకేష్ నుంచి మంగళవారం నాటుసారా స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. అయితే, గతంలోనూ ఆయన పట్టుబడగా బైండోవర్ చేశారు. కానీ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ సారా తయారు చేయడంతో రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐలు రమణ, వసంతలక్ష్మి తెలిపారు.

అధిక సాంద్రతతో లాభాల పంట

- పత్తిలో ఈ విధానం మేలు
- వరి సాగు విధానాల్లో ఖమ్మం ఆదర్శం
- వైరా కేవీకే కిసాన్ మేళాలో పరిశోధనా సంచాలకుడు రఘురామరెడ్డి


అధిక సాంద్రత విదానంలో సాగు చేసిన పత్తిని పరిశీలిస్తున్న రఘురామరెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు

వైరా: సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేయడం వల్ల దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కిసాన్ మేళాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు డాక్టర్ పి.రఘురామరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏటా పత్తి సాగు తగ్గిపోతోందని, ఈఏడాది రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల ఎకరాల్లో సాగైందని తెలిపారు. అధిక వర్షాలు, చీడపీడలు, పత్తిలో నాణ్యత లేకపోవడంతో పాటు కూలీల సమస్య ఇందుకు కారణమని పేర్కొన్నారు. అయితే, పత్తి సాగులోనూ యాంత్రీకరణ మొదలుకానున్నందున రైతులు ఈ దిశగా దృష్టి సారించాలని సూచించారు. అంతేకాక నూతన యాజమాన్య పద్ధతులు, అధిక సాంద్రత తదితర విధానం అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు.

ఖమ్మం రైతులు భేష్

వరిలో నేరుగా వెదజల్లే విధానం అవలంబిస్తున్న ఖమ్మం జిల్లా రైతులు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని రఘురామరెడ్డి పేర్కొన్నారు. ఇదేసమయాన పురుగుమందుల వినియోగం తగ్గించి సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో ఎక్కువ దిగుబడులు సాధించాలని సూచించారు. యాసంగిలో వరి కంటే అపరాల సాగు చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. అనంతరం కేవీకేలో అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పత్తిని పరిశీలించారు. కార్యక్రమంలో తెలంగాణ మండలి సహ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఐ.స్వర్ణలత, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్, వైరా కేవీకే కోఆర్డినేటర్ ఎ.శైలజ, డీఏఓ విజయ నిర్మల, ఉద్యానవన శాఖాధికారి అనసూర్య, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కిశోర్, శాస్త్రవేత్తలు రుక్మిణి, రవికుమార్, సునీత, వాణిశ్రీ, ఆర్‌ఈసీ సభ్యుడు రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ విధానంలో సాగు చేసిన వరి వంగడాలతో సత్యనారాయణరెడ్డి


పత్తి సాగు విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

ఆకట్టుకున్న మేళా

వైరా కేవీకేలో నిర్వహించిన కిసాన్ మేళాలో పలువురు రైతులు తాము సాగు చేసిన వంగడాలను ప్రదర్శించారు. వేంసూరు మండలం కందుకూరుకు చెందిన గొర్ల సత్యనారాయణరెడ్డి ఒక ఎకరంలో పరిశోధన కోసం సేంద్రియ విధానంలో సాగు చేసిన వరి రకాలను ప్రదర్శించగా శాస్త్రవేత్తలు అభినందించారు. అలాగే, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పలు అంశాలపై ఎగ్జిబిట్లు ప్రదర్శించగా, ఆదర్శ రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.